క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారు ఆదివారం ప్రత్యేక పూజలు అందుకున్నారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మా.. చల్లగా చూడమ్మా అంటూ గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండి వంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి పడవ పోటీల్లో బాలికల ప్రతిభ



క్రీడాకారిణిలను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి పడవ పోటీల్లో నంద్యాల బాలికలు పతకాలు సాధించారని రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఆదివారం కేనోయింగ్, కెయాకింగ్ సంఘం ఆధ్వర్యంలో బంగారు పతకాలు సాధించిన సునీత, మదర్‌థెరిసా ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులను కళారాధన కార్యాలయంలో అభినందించారు. డ్రాగన్ పడవ పోటీ మిక్స్‌డ్ విభాగంలో వర్ష, స్పందన, తబిత మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాదించారన్నారు. వ్యక్తిగత పడవ పోటీల్లో కూడా ఈ ముగ్గురు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. కళాశాల డైరెక్టర్ కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ శైలజ, సురేష్, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న భవానీ దీక్షాపరులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక జంబులాపరమేశ్వరి దేవస్థానంలో భవానీ మాలధారులు గురుభవానీ మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం చేశారు. మధుబాబు, సురేష్ మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు, గర్భిణుల కోసం 20 మంది మాలధారులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని చెప్పారు. రవీంద్రనాథ్, లక్ష్మయ్య, మునెయ్య, కన్నమ్మ, శీను, నంద్యాల బ్లడ్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కవితాగానం



సత్కారం అందుకున్న నంద్యాల కవులు

నంద్యాల(వ్యవసాయం): అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన మహాకవి సమ్మేళనంలో రాయలసీమ రత్నాలు అనే అంశంపై నంద్యాల కవుల కవితాగానం ప్రసంశలు అందుకుంది. రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ రాయలసీమ మహాకవి సమ్మేళనంలో కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, కొప్పుల ప్రసాద్, నీలం వెంకటేశ్వర్లు, నరేంద్ర, శేషఫణి, మధుసూదన్, మహబూబ్‌బాషా, ముర్తుజా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి నంద్యాల గాంధీగా ప్రసిద్ధి చెందిన ఖాదరబాద్ నర్సింగరావులపై వినిపించిన కవితలు శ్రోతలను అలరించాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, బొజ్జా దశరథరామిరెడ్డి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి కవులను సత్కరించి మెమొంటోలు అందజేశారు.

ఆల్‌మేవా అసోసియేషన్ ఏర్పాటు

శిరివెళ్ల: మండల కేంద్రంలో ఆదివారం నూతన ఆల్‌మేవా అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శిరివెళ్ల డివిజన్ అధ్యక్షుడిగా షజల్ రబ్బాని, జనరల్ సెక్రటరీగా ఇద్రుస్ బాషా, ఖజనాధికారిగా నూరుల్లా, హానరరీ ప్రసిడెంట్‌గా మహబూబ్‌బాషా, వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఎం.ఎండీ ఇబ్రహీం ఎన్నికయ్యారు. వైస్ ప్రసిడెంట్లుగా బురానుద్దీన్, అబ్దుల్ గఫార్, మహబూబ్ బాషా, అహమ్మద్ హుస్సేని, అడిషనల్ సెక్రటరీగా షేక్షా వలి, హుస్సేన్ అహమ్మద్, ఐటీ సెక్రటరీగా అబ్దుల్ రఫూఫ్, మస్తాన్‌వలి ఎన్నికయ్యారు. అలాగే ఉమెన్ సెక్రటరీలుగా కరిముస్సీషా, ఫర్జానా సుల్తానా, తన్వీర్ తపస్సుమ్, ఫిర్దోస్ జహాలను ఎన్నుకున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ముఖ్యమైన అంశాలపై పట్టు.. మార్కులు కొట్టు

- మార్చి 1 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న అధ్యాపకులు
- ముఖ్యమైన ప్రశ్నలపై గురిపెట్టాలంటున్న నిపుణులు



చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పరీక్షల సమయం ఆసన్నమైంది. మార్చి 1 నుంచి ప్రథమ, 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు థియరీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరో రెండున్నర నెలల గడువు మాత్రమే మిగిలి ఉంది. సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, ఈ విలువైన సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే అనుకున్న మార్కులు సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లాలోని 29 మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. 90 శాతం సిలబస్ పూర్తికావడం, సమయం తక్కువగా ఉండడంతో సిలబస్‌లోని అతి ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పరీక్షలకు సన్నద్ధమయ్యే అంశాలపై వివిధ సబ్జెక్టుల నిపుణులు పలు సూచనలు చేశారు.

లాంగ్వేజీ సబ్జెక్టులపై దృష్టి సారించాలి



మొత్తం మార్కుల్లో లాంగ్వేజ్ సబ్జెక్టుల మార్కులు సైతం కలుస్తాయి. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గ్రామర్‌కు, ప్రశ్నా జవాబులకూ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. మొదటి సంవత్సరంలో శ్మశాన వాటిక, సందీశ్వరుని శాపం, కపాల మోక్షం, అప్పుడే పుట్టి ఉంటే, గాన సుభాకరుడు మంగళంపల్లి, కందుకూరి, కుంకుడాకు, ఎచ్చరిక పాఠాలను, సెకండియంలోని శాంతి కాంక్ష, కర్మభూమిలో పూసిన ఓ పువ్వా, మన ఆటలు, వేమన కవిత్వంపై దృష్టి సారించాలి. పద్య, గద్య భాగాల్లోంచి వ్యాసరూప, ఉపవాచకం నుంచి 4 మార్కులు, అన్నింటి నుంచి మూడు మార్కుల ప్రశ్నలొస్తాయి. -వేదవతి, తెలుగు అధ్యాపకురాలు

అధిక మార్కులకు అవకాశం



ఫస్టియర్‌లో ఉమ్మడి కుటుంబం. సహకార సంఘాలు, వ్యాపార విత్తం మూలాధారాలు-2, తప్పుల సవరణ, సెకండియర్‌లో కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, పార్టనర్ షిప్‌లో పదవీ విరమణ, మరణం ప్రాధాన్యం గలవి. వ్యాపార విత్తం మూలాధారాలు-2 నుంచి 17 మార్కులు, ఎంట్రప్రెన్యూర్ నుంచి 14 మార్కులు వచ్చే అవకాశం. ఫస్టియర్‌లో వ్యాపార వ్యవస్థ స్వరూపాలు, భాగస్వామ్య వ్యాపార సంస్థ. జాయింట్ స్టాక్ కంపెనీ స్థాపన, వ్యాపార విత్తం మూలాధారాలు-01, సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థలు, బహుళజాతి సంస్థలు, సెకండియర్‌లో వినియోగదారుల రక్షణ, ఫైనాన్షియల్ మార్కెట్, బిజినెస్ సర్వీసెస్, ఫంక్షన్స్ ఆఫ్ కమర్షియల్ బ్యాంకింక్, ప్రిన్సిపల్స్ ఆఫ్ ఇన్సూరెన్స్‌లపై దృష్టి సారించాలి. వీటిని బాగా చదివితే అధిక మార్కులు సాధించవచ్చు.

- శ్రీనివాసరెడ్డి, ఎకనామిక్స్ అధ్యాపకుడు

పూర్తి మార్కులు పొందే చాన్స్



అన్నింటికీ సమ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా 75 మార్కులనూ పొందే అవకాశం ఉంది. మ్యాథ్స్-1ఏలో మాత్రికలు, ప్రమేయాలు, త్రికోణమితి, నిష్పత్తులు. పరివర్తనాలు, త్రిభుజ ధర్మాలు, సదిశల సంకలనం, సదిశల గుణకం, అతి పరావలయ ప్రమేయాలకు, 2ఏలో డీమూవర్స్ థీరం, సంభావ్యత, యాదృశ్చిక చలరాశులు, ద్విపద సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- కొండారెడ్డి, మ్యాథ్స్ లెక్చరర్

వ్యాసరూప ప్రశ్నలపై దృష్టి పెట్టాలి



ప్రథమ సంవత్సరంలో డోలనాలు, ఉష్ణగతిక శాస్త్రం, పని-శక్తి, సామర్థ్యం, పదార్థ ఉష్ణ ధర్మాల నుంచి ఎనిమిది మార్కుల ప్రశ్నలు వస్తాయి. ద్వితీయ సంవత్సరంలో కేంద్రకాలు, తరంగాలు, ప్రవాహ విద్యుత్ పాఠ్యాంశాల నుంచి వ్యాసరూప ప్రశ్నలు, మిగిలిన వాటి నుంచి 2, 4 మార్కుల ప్రశ్నలొస్తాయి.

- రామకృష్ణ, ఫిజిక్స్ అధ్యాపకుడు

చిత్ర పటాలు విధిగా వేయాలి



బోటనీ ఫస్టియర్‌లో జీవ వైవిద్యం, ప్రత్యుత్పత్తి విధానాలు, కణం నిర్మాణం, పుష్పించే మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తి, మొక్కల నిర్మాణాత్మక సంవిధానం-స్వరూప శాస్త్రాల నుంచి అధిక ప్రశ్నలొచ్చే అవకాశం ఉంది. బోటనీ సెకండియర్‌లో వృక్ష, శరీర ధర్మ శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం, మానవ సంక్షేమంలో మొక్కలు, సూక్ష్మ జీవులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- తిరుపతయ్య, జువాలజీ అధ్యాపకుడు

ఎక్కువ మార్కులొచ్చే చాప్టర్లను బాగా చదవాలి

ప్రథమ సంవత్సరంలో రాజనీతి శాస్త్రం పరిధి స్వభావం, జాతి-జాతీయత, హక్కులు బాధ్యతలు, ప్రజాస్వామ్యం, ప్రభుత్వంపై దృష్టి సారించాలి. ద్వితీయ సంవత్సరంలో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు-ఆదేశిక సూత్రాలు, కేంద్ర కార్య నిర్వాహక శాఖ, కేంద్ర శాసన నిర్మాణ శాఖ, భారత దేశంలో స్థానిక ప్రభుత్వాలు, ఏపీ, భారతదేశంలో ఇటీవల పరిణాలపై దృష్టి సారించాలి.

-రామమూర్తి, సివిక్స్, అధ్యాపకుడు

వైభవంగా దత్త జయంతి వేడుకలు



భక్తులకు దర్శనం ఇస్తున్న దత్తాత్రేయుడు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం షిర్డి సాయిబాబా దేవాలయం, జంబులాపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న సాయిబాబా దేవస్థానంలో ఆదివారం దత్తజయంతిని వైభవంగా నిర్వహించారు. బొమ్మలసత్రంలోని షిర్డిసాయిబాబా దేవస్థానంలో ఉదయాన్నే పంచమృతాభిషేకాలు, గంధాభిషేకం చేపట్టి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మహామంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. జంబులాపరమేశ్వరి ఆలయంలోనున్న బాబా ఆలయంలో దత్తాత్రేయ స్వామి, షిర్డిసాయినాథునికి విశేష పూజలు జరిపించారు. అనంతరం గణపతి, దత్తాత్రేయ హోమాలు చేపట్టి పూర్ణాహుతి గావించారు. తిరుమల తిరుపతి దేవస్థాన వ్యాఖ్యాత దివి హయగ్రీవాచార్యులు దత్తాత్రేయుని మహిమల గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో న్యాయవాది రావినూతల దుర్గాప్రసాద్, యాడికి శ్రీదేవి, ఉమామహేశ్వరమ్మ, యల్లాస్వామి పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.బాబులాల్

చాగలమర్రి: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును నిలిపివేసే వరకూ ఉద్యమం ఆగదని, పార్టీలకు అతీతంగా పోరాడుతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.బాబులాల్ అన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ ఆదివారం కడప పట్టణంలోని ఆజాద్ నగర్ మైదానంలో జమాతే-ఉల్మా-హింద్ సంస్థ చీఫ్ మౌలానా అర్షద్ మదని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు చాగలమర్రి నుంచి ముస్లింలు భారీగా తరలివెళ్లారు. 250 కార్లు, 12 లారీలు, 8 బస్సులలో సుమారు 5 వేల మంది పయనమైనట్లు షేక్.బాబులాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి, కులాలు, మతాల మధ్య చిచ్చు రేపి దేశ ఐక్యతను, సమగ్రతను మంటలో గలుపుతుందని ఆయన విమర్శించారు. వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్న సుమారు 90 వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెడుతున్న బిల్లును నిలిపివేయాలన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవడానికి అవిశ్రాంతంగా, పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామన్నారు.

వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

నంద్యాల(అర్బన్): రేనాటి వీరుడు వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 11వ తేదీన నిర్వహించే వడ్డె ఓబన్న జయంతికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి రాష్ట్రమంతా జయంతి వేడుకలు నిర్వహించాలన్నారు. అలాగే స్థానిక శ్రీనివాస సెంటర్‌లో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు పుల్లయ్య, సురేష్, సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య పాల్గొన్నారు.

లోకమంతటా వెలుగు ప్రకాశించెను

- నంద్యాలలో ఘనంగా క్యాండిల్ లైట్ సర్వీస్



మాట్లాడుతున్న బిషప్ బీడీ ప్రసాదరావు



క్యాండిల్ లైట్ సర్వీసులో పాల్గొన్న క్రైస్తవులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2 (ఆల్ సెయింట్ చర్చి)లో ఆదివారం రాత్రి క్యాండిల్ లైట్ సర్వీసును పాస్టరేట్-2 డీనరీ చైర్మన్ రెవరెండ్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప రాయలసీమ డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ బీడీ ప్రసాదరావు పాల్గొని క్రైస్తవులకు దైవసందేశాన్ని అందించారు. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగై యున్నాడని క్రైస్తవుల విశ్వాసం అన్నారు. అందులో భాగంగానే చర్చిలో క్యాండిల్ లైట్ సర్వీస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం క్వయర్ బృందం ఆలపించిన ప్రత్యేక భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. క్రైస్తవులు కొవ్వొత్తులను వెలిగించి లోకమంతటా వెలుగు ప్రకాశించెను అంటూ ప్రత్యేక గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రెవరెండ్ విజయ్‌కుమార్, జోయెల్, మరియన్ దీప్, సెక్రటరీ కిరణ్‌కుమార్, బైబిల్ సొసైటీ సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బాలయ్య పాల్గొన్నారు.

పాస్టరేట్-5 ఆలయంలో..

పట్టణంలోని టెక్కెలో ఉన్న నంద్యాల డయాసిస్ పరిధిలోని పాస్టరేట్-5 సీఎస్ఐ ఆలయంలో ఆదివారం క్యాండిల్ లైట్ సర్వీసును పాస్టర్ సుమిత్ర గురువుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో దైవ సందేశం అందించేందుకు నంద్యాల హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేల్-2 చర్చి గురువులు జోయల్ మరియన్‌దీప్ పాల్గొన్నారు.



క్యాండిల్స్‌తో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

పాస్టరేట్-6 ఆలయంలో..

స్థానిక డేనియల్‌పురంలో ఉన్న పాస్టరేట్-6 సీఎస్ఐ ఆలయంలో ఆదివారం క్యాండిల్‌లైట్ సర్వీసును కమిటీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాస్టరేట్ చైర్మన్ కాంతరావు గురువు దైవసందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులంతా క్యాండిల్స్ వెలించుకొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ క్రిస్మస్ ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని పాస్టర్ స్వర్ణ ప్రభాకర్ ప్రార్థించారు. సంఘ కాపరి జయానందం, సంఘపెద్దలు బండి మునిస్వామి, అవుకు రమణ, గుండి పుల్లయ్య, బరిగెల విజయ్, నల్లిగారి తిరుపాలు, అయ్యల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి.. అమరజీవి



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న డీఈఓ



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ, తదితరులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రసాధనకు ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించి అమరజీవి పొట్టి శ్రీరాములు ధన్యజీవి అని డీఈఓ జనార్దన్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం పట్టణ సమీపంలోని నందమూరి నగర్‌లో ఉన్న సుభాష్‌చంద్రబోష్ ఆవాసియ విద్యాలయంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఈఓ మాట్లాడుతూ మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహంస, హరజనోద్ధరణ ఆశయాల కోసం కృషిచేసిన మహానీయుడన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడని వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ నిర్వాహకుడు సుబ్బరాయుడు, రాజేశ్వరమ్మ, సిబ్బంది నాగలక్ష్మీ, సౌజన్య, లక్ష్మీదేవి, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, నాయకులు తిరుపాలయ్య, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్, చంద్రశేఖర్, సత్యం పాల్గొన్నారు.

బొమ్మలసత్రం: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయ అవరణలో ఎస్పీ ఆదేశాల మేరకూ పోలీసులు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి డీఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, నాగభూషణం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): ఉమామహేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని సంజీవనగర్‌లోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు యాడికి శ్రీదేవి పాల్గొన్నారు. అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ ఉపేంద్ర, కుమార్ నివాళులర్పించారు. సేగు శ్రీదర్, మధు, రాము పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టిశ్రీరాములు సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎంపీపీ ప్రభాకర్ తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, ఏఓ షాను, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



ఆళ్లగడ్డలో సిబ్బందితో కలిసి పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ కిశోర్



చాగలమర్రిలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆళ్లగడ్డ: అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేదని మున్సిపల్ కమిషనర్ కిశోర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యలయంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఫిట్టర్ ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం చాగలమర్రిలోని గాంధీ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలను ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు బి.సుబ్రమణ్యం కొనియాడారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, రవీంద్రారెడ్డి, పీడీ దాదాపీర్‌ల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు నవత ప్రసాద్, నాగభూషణం, రాజేశ్, జగదీష్, మల్లికార్జున, ఆనంద్ పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సిబ్బంది నివాళులర్పించారు.

శిరివెళ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచు బీ. ఇంతియాజ్ శ్రీ రాములు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాలను కొనియాడారు.

ఉయ్యాలవాడ : స్థానిక గ్రామ సచివాలయం, మోడల్‌స్కూల్‌లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసే, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ గ్రామసభ

చాగలమర్రి: మండల పరిధిలోని కదిరిపురం తండాలో సోమవారం ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై గ్రామసభ నిర్వహించనున్నారు. కాగా, ఈ నెల 12వ తేదిన సాయంత్రం గ్రామ సభ నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తుండగా ఆ గ్రామనికి చెందిన కొంత మంది టీడీపీ కార్యకర్తలు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ వాగ్వాదానికి దిగడంతో ఏపీఓ నిర్మలా దేవి సభను నేటికి వాయిదా వేశారు. అయితే ఏపీఓ ఉద్దేశపూర్వకంగా సభ వాయిదా వేశారని సర్పంచ్ రామ్లానాయక్ ఆరోపించారు.

ఈ గ్రామసభను సోమవారం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఇచ్చారని ఈ రోజైనా గ్రామ సభ సజావుగా కొనసాగుతుందా అని ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మండలంలోని ప్రతి గ్రామంలో ఏపీఓపై పలు ఆరోపణలు వస్తున్నట్లు తెలుస్తోంది. వీటిపై జిల్లా అధికారులు విచారణ జరిపి ఏపీఓపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు కోరుతున్నారు.

రేపు రెవెన్యూ గ్రామసభ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ. కొత్తపల్లె గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీలను స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కారం చూపుతామన్నారు.

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎద్దులు



పోటీ పడుతున్న ఎద్దులు

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టులో వెలసిన కాశినాయన 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం తెలుగు రాష్ట్రాల స్థాయి పెద్దసైజు బండలాగుడు పోటీలు జరిగాయి. పోటీల్లో గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ప్రలగం ప్రతిజ్ఞరెడ్డి, జస్వితరెడ్డిల ఎద్దు మొదటి స్థానంలో నిలువగా నగదు బహుమతి రూ.60,116 అందజేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరస్వామిచౌదరి ఎడ్లజత ద్వితీయ స్థానంలో నిలవగా రూ.50,116 అందించారు. అలాగే నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు తృతీయ స్థానం సాధించగా రూ.40,116 బహుమతి ఇచ్చారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన గారటికె నాగిరెడ్డి ఎడ్లజత నాలుగో స్థానంలో నిలువగా రూ.30,116 బహూకరించారు.



హరివరం-క్రిష్టిపాడు రహదారిలో పొగమంచులో పొలానికెళ్తున్న రైతు



దొర్నిపాడు సమీపంలో పొలాలను కమ్మేసిన మంచు దుప్పటి

మంచు కురిసేవేళలో..

దొర్నిపాడు: మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి పొగమంచు కురిసింది. ఉదయం 8గంటలు అవుతున్నా మంచు సూర్యభగవానుడి కిరణాలు నేలకు తాకకుండా చేసింది. పొగమంచులో ఇక్కడి పొలాలు, నదులు, రహదారులు ప్రకృతి ప్రేకులను పరవశింపజేశాయి.